క్లుప్తంగా

పోలీస్ కుటుంబాలకు అండగా చేయూత పథకం



రాములు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేటటౌన్ : చేయూత పథకం పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటుందని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. సూర్యాపేట జిల్లా ఆర్మడ్ విభాగంలో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాములు ఇటీవల మృతి చెందారు. దీంతో పోలీసు చేయూత పథకం ద్వారా రూ.2లక్షల చెక్కును మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎస్పీ కార్యాలయంలో అందజేసి మాట్లాడారు. సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ పోలీసు శాఖ కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమం ఏఓ మంజు భార్గవి, పోలీసు సంఘం అధ్యక్షుడు రామచందర్ గౌడ్, ఆర్ఎస్ఐ సాయిరాం పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు అందజేత

సూర్యాపేట : తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎ. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఈ నెల 6న నిర్వహించిన ప్రైవేట్ టీచర్స్ గౌరవ సన్మాన సభలో సూర్యాపేట మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన ఆరాల రమేష్ యాదవ్ ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి అందజేశారు.

హెల్త్ ఎమర్జన్సీ ప్రకటించాలి

భానుపురి : అంటు వ్యాధులు, విషజ్వరాలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే హెల్త్ ఎమర్జన్సీ ప్రకటించాలని సీపీఎం వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంటువ్యాధులు, విష జ్వరాల నివారణకు చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు, డాక్టర్లు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ వన్ టౌన్ కమిటీ సభ్యులు అర్వపల్లి లింగయ్య, కోడి ఎల్లయ్య పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌కు సన్మానం



మహేష్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పటేల్ రమేష్‌రెడ్డి, నాయకులు

భానుపురి : టీపీసీసీ అధ్యక్షుడిగా ఇటీవల నూతనంగా నియమితులైన బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మంగళవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో ఘనంగా సత్కరించారు. రమేష్ రెడ్డి వెంట జిల్లా కాంగ్రెస్ నాయకులు ముదిరెడ్డి రమణారెడ్డి, గట్టు శ్రీనివాస్, దారావత్ వెంకన్న నాయక్, ఎడ్ల వీరమల్లు యాదవ్, జనార్దన్ రెడ్డి, భాస్కర్ నాయక్, రవి నాయక్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నూతనకల్ : మండల పరిధిలోని ఎర్రపహాడ్, మిర్యాల గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రణయ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. దిర్శనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి మద్దిరాల మండల పరిధిలోని ముకుందాపురం సబ్ స్టేషన్ వరకు నూతనంగా నిర్మించే 33కేవీ లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా ఎర్రపహాడ్, మిర్యాల గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. విద్యుత్ అంతరాయానికి రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

దెబ్బతిన్న రహదారి పరిశీలన

అర్వపల్లి : భారీ వర్షాలకు కోతకు గురైన మర్రిబావితండా రోడ్డు మరమ్మతుకు తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్ సహకారంతో కృషిచేయనున్నట్లు జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి చెప్పారు. కొమ్మాల గ్రామపంచాయతీ ఆవాసం మర్రిబావితండా ఫార్మేషన్ రోడ్డు భారీ వర్షాలకు కొట్టుకుపోవడంతో మంగళవారం ఆ రహదారిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కుక్కడపు సైదులు, గంగదెరి శ్రీనివాస్, సైదిరెడ్డి, భిక్షం, లక్ష్మయ్య, రవి, శ్రీనివాస్, సత్తయ్య, ప్రవీణ్, మల్లయ్య, వెంకటయ్య, నర్సింహ, రాకేష్ పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

ఆత్మకూర్ (ఎస్) : గణేష్ ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని ఎస్ఐ సైదులుగౌడ్ అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండల పరిధిలోని డీజే ఆపరేటర్లను తహసీల్దారు ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాత్రి పదిగంటల తర్వాత ఎవరూ లౌడ్ స్పీకర్ పెట్టొద్దని, తప్పనిసరిగా ఇద్దరు మండపంలో నిద్రించాలని సూచించారు.

వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి

తుంగతుర్తి : భూస్వాములకు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మంగళవారం వెంపటిలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, నాయకులు దొంగరి గోవర్దన్, సుంకరి జనార్దన్, చింతకుంట్ల వెంకన్న, ఝాన్సీరెడ్డి, దాసరి శ్రీను, అంజయ్య, సత్యనారాయణ, ఉప్పుల రాంబాబు, నాగరాజు, వెంకన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా తుంగతుర్తి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుజ్జ యుగేంధర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గుండగాని రాములు, తునికి సాయిలు, దొంగరి శ్రీనివాస్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలి

భానుపురి : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. దున్నేవాడికి భూమి కావాలని, వెట్టిచాకిరీ రద్దు చేయాలని, భూస్వామ్య విధానం రద్దు కావాలని, పేదల హక్కులను రక్షించాలని పోరాటం చేసిన వ్యక్తి చాకలి ఐలమ్మ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు జిల్లపల్లి నరసింహారావు, వీరబోయిన రవి, నాయకులు కోడి ఎల్లయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పోరాడే వాళ్లే ఐలమ్మ వారసులు

ప్రజల కోసం నిరంతరం పోరాడే వాళ్లే చాకలి ఐలమ్మ వారసులని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. మంగళవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పార్టీ జిల్లా నాయకులు పేర్ల నాగన్న, గొడ్డలి నరసన్న, సూరం రేణుక, ఎస్‌కే సయ్యద్, మోహన్, బాలస్వామి, ప్రవీణ్, పద్మ, గుండగాని రేణుక తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రజక సంఘం నాయకులతో పాటు వివిధ పార్టీల నాయకులు అన్నారు. మంగళవారం ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షుడు వీరమల్ల శ్రీను, హుస్సేన్, నెల్లుట్ల మహేష్, మైలారపు ఉప్పలయ్య, సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి, బొజ్జ శ్రీనివాస్, తొట్ల లింగయ్య, రామసాని శ్రీనివాస్‌రెడ్డి, పులసరి వెంకటముత్యం, తొట్ల రాంబాబు, బత్తుల తిరుమలేష్ పాల్గొన్నారు.

అర్వపల్లి : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని కొమ్మాల గ్రామంలో మంగళవారం రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు దూదిగామ సంపత్, సంఘం నాయకులు బాసాని లక్ష్మయ్య, అశోక్, సతీష్, రంజిత్, బన్సరి ఉపేందర్, శ్రీను, ఉప్పలయ్య, సంపత్, ఉపేందర్, మహేష్ పాల్గొన్నారు.

మద్దిరాల : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని కుక్కడం గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు నల్లగంటి రామనర్సు, ఆరునూర్ల సోమయ్య, వడ్లకొండ చంద్రమౌళి, నల్లగంటి నరేష్, ఆరునూర్ల వీరస్వామి, నాగరాజు, అనిల్, నరేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తి : వెంపటిలో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్



భానుపురి : ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



తుంగతుర్తిలో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



భానుపురి : ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



నూతనకల్ : రజక సంఘం ఆధ్వర్యంలో..



అర్వపల్లి : కొమ్మాలలో..

ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సు

సూర్యాపేటటౌన్ : ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఆల్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణుడు షేక్ అలీముద్దీన్ మాట్లాడారు. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దని, జీవితంలో పోరాడి సాధించాలని యువతకు సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ సుజాత మాట్లాడారు. ఆత్మహత్యల నివారణకు ఆల్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఇక్బాల్, భాస్కర్, జావిద్, ప్రసాద్, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

14న వెంకయ్య సంతాప సభ

పెన్‌పహాడ్ : ఈ నెల 14న చీదెళ్ల గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకుడు మర్రిపెల్లి వెంకయ్య సంతాప సభను నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం చీదెళ్లలో నిర్వహించిన సీపీఎం గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంతాప సభకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డిలు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపెల్లి సైదులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పులుసు సత్యం, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, వీరబోయిన రవి, సీపీఎం మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నీరు సాఫీగా వెళ్లేలా చూస్తాం

పెన్‌పహాడ్ : నాగులపాటి అన్నారం గ్రామంలోని 9వ వార్డులో మురుగు నీరు డ్రెయినేజీలోకి సాఫీగా వెళ్లేలా చేస్తామని మండల అధికారులు అన్నారు. మంగళవారం వారు మురుగు నీరు నిలుస్తున్న ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. మురుగు నీరు పొలాల్లోకి వస్తుందని కొంతమంది రైతులు అడ్డుకట్టలు వేయడంతో ఆ నీరంతా ఇళ్ల పరిసరాల్లో నిలిస్తుందని పలువురు ఇటీవల కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మండల అధికారులు మంగళవారం గ్రామంలోని రైతులు, కాలనీవాసులతో మాట్లాడారు. తాత్కాలికంగా ఏర్పాట్లు చేసి డ్రెయినేజీలోకి మురుగు నీరు వెళ్లే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లాలు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంపీఓ సంజీవయ్య, పంచాయతీ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నాగారం : విద్యార్థులు బాల్యం దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం పసునూర్ మోడల్‌స్కూల్, జెడ్పీహెచ్ఎస్‌లలో విద్యార్థులకు పిల్లల చట్టాలు, వారి సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులు బాల్యంలో ఆలోచనా విధానాన్ని మార్చుకొని భవిష్యత్తు గమ్యాలను సాధించాలన్నారు. పాఠశాల దశలో పిల్లలు తీసుకున్న నిర్ణయాలు వారి జీవితంలో పునాదుల్లా ఉంటాయని తెలిపారు. బాలల సమస్యలపై 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం సేఫ్ టచ్, అన్‌సేఫ్ టచ్, డీసీపీయూ యాక్టివిటీస్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కుంట రమేష్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ బి. లింగనాయక్, డీసీపీయూ అధికారులు శోభారాణి, లక్ష్మణ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమేష్, యాకమల్లు, కార్తీక్, రాజేందర్, మానసవీణ, హరిత, కరుణాకర్, గణేష్, రాజ్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పసునూర్ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారి శ్రీలక్ష్మి

ఆకట్టుకుంటున్న గణనాథుడి విగ్రహాలు

గణేష్ నవరాత్రుల్లో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో భక్తులు వివిధ రూపాల్లోని విగ్రహాలను ప్రతిష్ఠించారు. వినాయకుడి విగ్రహాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట




వేదాంత భజన మందిరంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం



కస్తూరి బజారులో..



జూనియర్ కాలేజీ సమీపంలో..



ఎడ్ల గోపయ్య విగ్రహ సమీపంలో..

ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలి

నాగారం : మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఆయిల్‌పామ్ తోటల సాగుపై రైతులు దృష్టి సారిస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి పి.కృష్ణకాంత్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వర్ధమానుకోట రైతు వేదికలో అయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పాం పంట సాగు చేసుకొని, అధిక లాభాలు పొందవచ్చు అన్నారు. ఆసక్తి గల రైతులు ఉద్యాన శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శ్వేత, శ్రీనివాస్, పతంజలి ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ అశోక్, క్షేత్ర సహాయకులు రంగు ముత్యంరాజు, రైతులు వడ్డే పరశురాములు, రాపోలు సురేష్, కుమారస్వామి, నరేష్, మోహన్‌రెడ్డి, సోమిరెడ్డి, తెల్సూరి లింగయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్ద పీట

సూర్యాపేట : పట్టణ మున్సిపల్ పరిధిలోని విద్యానగర్ 45వ వార్డులో ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్ తెలిపారు. ప్రజా వినతుల మేరకు మంగళవారం వార్డులోని కుక్కలను మున్సిపల్ సిబ్బందితో పట్టించి జనసంచారం లేని ప్రాంతాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో జవాన్ వెంకన్న, ఇస్మాయిల్, మహేష్, భిక్షం, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు కృషిచేయాలి

నూతనకల్ : పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి రాములు నాయక్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల రీసోర్స్ భవనంలో నూతనకల్, మద్దిరాల మండల స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విడుదల చేస్తున్న నిధుల ద్వారా ఆయా పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించాలని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు వేగవంతంగా పూర్తి చేస్తాం

- ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి : భారీ వర్షాల కారణంగా కేతిరెడ్డి ఆనకట్ట ఫీడర్ చానల్‌కు ఏర్పడిన గండ్లకు సంబంధించి మరమ్మతు పనులు వేగవంతంగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గొట్టిపర్తి, రావులపల్లి, చౌళ్లతండాలలో ఇటీవల వర్షాలకు గండ్లు పడిన కాలువలు, చెరువులు, ఆనకట్టలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వర్షాలకు కేతిరెడ్డి ఆనకట్ట ఫీడర్ చానల్‌కు నాలుగు గండ్లు పడ్డాయని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ గండ్లను పూడ్చడానికి ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. కేతిరెడ్డి ఆనకట్ట మరమ్మతులకు ప్రభుత్వానికి సుమారు రూ.13.30కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నెల రోజుల్లో ఆనకట్టకు మరమ్మతులు పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందిస్తామన్నారు. త్వరలో ఎస్సారెస్పీ జలాలను విడుదల చేస్తామని తెలిపారు. గొట్టిపర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని విద్యార్థులు వినతిపత్రం అందించడంతో సంబంధిత అధికారులతో మాట్లాడారు. పాఠశాలకు సీసీరోడ్డు మంజూరు చేయిస్తానన్నారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, ఇరిగేషన్ డీఈ సత్యనారాయణ, తహసీల్దార్ కంఠమయ్య, ఎంపీడీఓ శేషుకుమార్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దొంగరి గోవర్ధన్, సుంకరి జనార్దన్, చిలకల వెంకన్న, చింతకుంట్ల వెంకన్న, అవిలమల్లు, రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కేతిరెడ్డి లత, మాజీ సర్పంచ్ వెంకన్న, ఝాన్సీరెడ్డి, తెడ్డు కృష్ణారావు, ఉప్పుల రాంబాబు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గొట్టిపర్తిలో కేతిరెడ్డి వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

వినాయకుడి మండపాల వద్ద ప్రత్యేక పూజలు

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని 45వ వార్డులో గణేశుడి విగ్రహం వద్ద కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ ఆధ్వర్యంలో మంగళవారం 3000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

37వ వార్డులో..

37వ వార్డులో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి వార్డు కౌన్సిలర్ బైరు శైలేందర్ హాజరయ్యారు.

47వ వార్డులో దీపోత్సవం..

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 47వ వార్డులో గణేశుడి పూజానంతరం దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఓంకారం, శివుడు, స్వస్తిక్ ఆకృతులలో దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో సుధా బ్యాంక్ వైస్ చైర్మన్ పానుగోటి నిర్మల, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే కిషోర్ కుమార్ మంగళవారం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంకేపల్లి రఘునందన్ రెడ్డి, బత్తుల శ్రీధర్, నరోత్తం రెడ్డి, తెడ్డు భాస్కర్, దేవా, చారి, నరేష్, యాకుబ్ నాయక్, కరుణాకర్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ మంగళవారం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు గుజ్జ యుగేంధర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గుండగాని రాములు, తునికి సాయిలు, దొంగరి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ చెరుకు సృజనపరమేష్ పాల్గొన్నారు.

అర్వపల్లి : గ్రామాల్లో వినాయకుడి విగ్రహాల వద్ద మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదానం ఏర్పాటు చేశారు.



సూర్యాపేట : 45వ వార్డులో అన్నదానం చేస్తున్న కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్



నూతనకల్‌లో అన్నదానం..



సూర్యాపేట : దీపాలు వెలిగిస్తున్న మహిళలు



తిరుమలగిరిలో పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కిషోర్

సంక్షిప్త సమాచారం

నీటి కాలుష్యంపై విచారణ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని లోయపల్లి గ్రామంలో ఊరబావి నీళ్లు కలుషితమై వస్తున్నందున ఆ నీటి వినియోగాన్ని నిలిపివేయాలని గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఎంపీడీఓ తుమ్మల పవన్‌కుమార్ గ్రామానికి వెళ్లి ప్రజల సమక్షంలో విచారణ చేశారు. ఊరబావి నీటిని పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ రిపోర్టు వచ్చాక తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్, మాజీ సర్పంచ్ వల్లపు గంగయ్య, ఉపాధిహామీ ఈసీ నగేష్, టీఏ యాదమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

నాగారం : ప్రజలు శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వర్ధమానుకోటలో గణేష్ ఉత్సవాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఎస్ఐ ఎం.ఐలయ్య, పోలీసు సిబ్బంది, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ

పెన్‌పహాడ్ : విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. చీదెళ్ల గ్రామానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి దేశగాని శ్రీనివాస్ సమకూర్చిన రూ. 15వేలు విలువైన 30 క్రీడా దుస్తులను మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా దాత శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, పీడీ రవికుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.